కనుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం

వాడవాడలా వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

- రామ మందిరాల్లో విశేష పూజలు
- భక్తుల శ్రీరామ నామస్మరణతో పులకించిన సింహపురి

నగరంలోని వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామ మందిరాలతో పాటు రామబంటు ఆంజనేయస్వామి మందిరాల్లో ఉదయం సీతారాములకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి కల్యాణాన్ని తిలకించి తన్మయం చెందారు. భక్తుల శ్రీరామ నామస్మరణతో సింహపురి పులకించింది. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు పానకం, వడపప్పు, అన్నప్రసాద వితరణ చేశారు.

నెల్లూరు (బృందావనం): రాంనగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రంలో ఉదయం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. శబరి శ్రీరామక్షేత్రం ఎదురుగా ఉన్న శ్రీరామకోటి స్థూపప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. తొలుత శబరి శ్రీరామక్షేత్రంలో సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి భక్తులు రామ నామస్మరణ నడుమ పల్లకిలో ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు చేర్చారు. సంప్రదాయంలో భాగంగా వరుడి తరుపున పట్టువస్త్రాలను తెలుగుగంగ ప్రాజెక్ట్ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ హరినారాయణరెడ్డి, రెడ్డి వాణి దంపతులు సమర్పించారు. వధువు తరుపున ముత్యాల తలంబ్రాలను ఒకటో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి కపర్ది, గాయత్రి దంపతులు అందజేశారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపారు. కల్యాణోత్సవ వ్యాఖ్యాతగా వేదాంతం నరేష్ ఆచార్యులు వ్యవహరించారు. అనంతరం సుమారు 8వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. శబరి శ్రీరామక్షేత్రం భక్తబృందం ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, మజ్జిగ, పానకం, ప్రసాదాలను పంపిణీ చేశారు. కల్యాణోత్సవానికి ఉభయకర్తలుగా పిడూరు కిషోర్‌రెడ్డి, శరణ్య, పిడూరు భానుప్రకాష్‌రెడ్డి, నాగమణి దంపతులు వ్యవహరించారు. శబరి శ్రీరామక్షేత్రం భక్తబృందం, కమిటీ నిర్వాహకులు చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, రఘునాథరాజు, వెంకురెడ్డి, చంద్రారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఆదాల

సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తిలకించారు. అలాగే మేయర్ పొట్లూరి స్రవంతి, స్థానిక కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు మలిరెడ్డి కోటారెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్రాధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, బీజేపీ నేత పీ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేదాయపాళెం త్యాగరాజ మందిరంలో సీతారాముల కల్యాణోత్సవం

శ్రీరామకోటి పుస్తకాల నిక్షిప్తం

గత ఏడాది నుంచి శ్రీరాముడిని స్మరిస్తూ భక్తులు రాసిన శ్రీరామకోటి పుస్తకాలను ప్రాంగణంలోని శ్రీరామకోటి స్థూపంలో సాయంత్రం నిక్షిప్తం చేశారు. ఈ కార్యక్రమాలను శబరిశ్రీరామక్షేత్రం భక్తబృందం పర్యవేక్షించింది.

- రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. సాయంత్రం ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవ, రాత్రి 8గంటలకు హనుమంతసేవ వేడుకగా నిర్వహించారు.
- స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో బుధవారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా గుండ్లపల్లి శ్రీధర్‌రావు, మధుసూదన్‌రావు, వామ సతీష్‌కుమార్ వ్యవహరించారు.
- జెండావీధిలోని బొందిలి వీధిలో ఉన్న హనుమాన్ మందిరంలో హనుమాన్ మందిర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకులు, జిల్లా బొందిలి సంఘ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొదలకూరురోడ్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీ రమణమూర్తి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా చెంచయ్య, ఆదిలక్ష్మి దంపతులు వ్యవహరించారు.
- వేదాయపాళెంలోని త్యాగరాజనగర్‌లో ఉన్న త్యాగరాజ మందిరంలో ఉదయం విశేష పూజలు, మధ్యాహ్నం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి గజ వాహనోత్సవం, ఊంజల్‌సేవ కనులపండువగా నిర్వహించారు.
- పడారుపల్లిలోని కోదండరామస్వామి దేవస్థానంలో సీతారాములు కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం సీతారాముల నగరోత్సవం జరిపారు. ఉదయం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ధర్మకర్త పాముూరు మల్లికార్జునరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- 20వ డివిజన్ భక్తవత్సలనగర్‌లోని పెద్ద బావిసెంటర్ రామాలయం వద్ద ఆ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి రావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.
- ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్, వివేకానంద వాకర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాఘవాచార్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు, విసనకర్రలు పంపిణీ చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, వాకర్స్ అసోసియేషన్ల నిర్వాహకులు పాల్గొన్నారు.
- విజయమహల్‌సెంటర్‌లో ఆ సెంటర్ మిత్ర మండలి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు.

నెల్లూరు (వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని పునరావాసకాలనీలో ఉన్న సీతారామ మందిరంలో ఉదయం విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ నిర్వాహకులు చిరంజీవి, చెన్నారాయుడు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, మోహన్, చిన్నా, నరసింహారావు, పరమేశ్వరరావు, వెంకీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నెల్లూరు(బారకాసు): గోమతినగర్‌లోని సత్య సాయి మందిరం(సాయిహృదయ)లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. సత్యసాయి సేవా సమితి గౌరవాఅధ్యక్షుడు మురళీకృష్ణ, మందిర కన్వీనర్ కొండా శేషగిరిరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రంగనాథస్వామి ఆలయంలో హనుమంత సేవ



బీవీనగర్‌లో అన్నప్రసాద వితరణ చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



సాయిహృదయ మందిరంలో..



వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ..



జెడ్పీ వాకర్స్ ఆధ్వర్యంలో..



శబరి శ్రీరామక్షేత్రంలో పూజల్లో పాల్గొన్న జడ్జి కపర్ది దపంతులు



వెంకటేశ్వరపురం, పునరావాసకాలనీలో..

క్లుప్తంగా

ఆదాలకు మద్దతుగా ప్రచారం



నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా 35వ డివిజన్‌లో ఏపీఆర్ ఆర్మీ బృందం బుధవారం విస్తృత ప్రచారం చేపట్టింది. త్వరలో జరగనున్న ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి ఆదాలను ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ ఆర్మీ సభ్యులు వైవీ రెడ్డి, శ్రీధర్, అల్లాభక్షు, నరసింహారెడ్డి, షబ్బీర్, ఇస్మాయిల్, అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడగాలులపై అప్రమత్తంగా ఉండండి

- తహసీల్దార్ చిరంజీవి

మనుబోలు : మండల పరిధిలో ఎండల తీవ్రతతో పాటు వడగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చిరంజీవి సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎండల తీవ్రత గత కొన్ని రోజులుగా విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. మధ్యాహ్నం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. చిన్నారులు, వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్య రీత్యా తాగునీరు, కొబ్బరినీరు, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ ద్రావణాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. మద్యం, టీ, కాఫీలకు దూరంగా ఉండాలని తెలిపారు.

నేడు ప్రసన్నకుమార్‌రెడ్డి నామినేషన్ దాఖలు

కోవూరు : వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం ఉదయం 11.04 నిమిషాలకు కోవూరు తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఎలాంటి ప్రచార ఆర్భాటాలు లేకుండా ఆయనతో పాటు కుటుంబసభ్యులు నలుగురు మాత్రమే హాజరుకానున్నారు.

వెండి కిరీటాల బహూకరణ



మనుబోలు : మనుబోలు పడమటి వీధిలోని కోదండ రామాలయానికి దాతలు బుధవారం వెండి శఠారి, కిరీటాలను బహూకరించారు. గ్రామానికి చెందిన ఉచ్చూరు లక్ష్మీనరసారెడ్డి, తనూజమ్మ దంపతులు వీటిని అందించారు. శ్రీరామనవమి సందర్భంగా అర్చకుడు సుబ్రహ్మణ్యంశర్మ సీతారాములకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కిరీటాలను అలంకరించారు. ఉభయకర్తలుగా కాంద్ర నరసారెడ్డి, శాంతి దంపతులు వ్యవహరించారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



పొదలకూరు : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్ఓ వరకుమార్ పర్యవేక్షణలో సిబ్బంది డెమో ద్వారా అగ్నిప్రమాదాలు సంభవిస్తే ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. మంటలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక ఉద్యోగులు పాల్గొన్నారు.

వలంటీర్ల సామూహిక రాజీనామా

పొదలకూరు : పట్టణంలోని సచివాలయం బిట్–3 పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లు బుధవారం సామూహిక రాజీనామాలు చేశారు. తమ రాజీనామా లేఖలను సచివాలయ ఉద్యోగికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సేవలను ప్రతిపక్ష పార్టీలు వక్రీకరిస్తున్న నేపథ్యంలో రాజీనామాలు చేసినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలుస్తామని తెలిపారు.

క్రైస్తవులకు అండగా ఉంటాం



ఆదాలను ఆశీర్వదిస్తున్న క్రైస్తవ మతపెద్దలు



ఆత్మీయ సమావేశానికి హాజరైన క్రైస్తవులు

నెల్లూరు సిటీ: క్రైస్తవులకు అన్ని విధాలా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్‌లోని పిచ్చిరెడ్డి కల్యాణ మండపంలో రూరల్ నియోజకవర్గ క్రైస్తవుల ఆత్మీయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణ వెంకయ్య ఆధ్వర్యంలో పాస్టర్ జోసఫ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రూరల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే తన ధ్యేయమని తెలిపారు. గతంలో రూరల్ నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, కబ్జాలు ఉండేవని, తాను సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శాంతియుత వాతావరణం కొనసాగుతోందన్నారు. తాను 25 ఏళ్ల రాజకీయ జీవితంలో కేవ లం అభివృద్ధిని మాత్రమే ఆకాంక్షించానని,. అవినీతి కార్యక్రమాలకు దూరంగా ఉన్నానన్నారు. తనకు మద్దతు ఇచ్చిన క్రైస్తవులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా క్రైస్తవ మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆదాలకు ఆశీర్వచనాలు అందజేశారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సుధీర్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, క్రైస్తవ మత పెద్దలు ఫాదర్ విజయరత్నం, ఎలీషా కుమార్, తాళ్లూరు సురేష్ బాబు, దాసరి రాజేష్‌బాబు, షాలిని తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సాయినాథుడి నగరోత్సవం



సాయిబాబా నగరోత్సవం



నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

నెల్లూరు(బృందావనం): శ్రీరామనవమి సందర్భంగా బాలాజీనగర్‌లోని పద్మావతినగర్‌లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో బుధవారం ఉదయం సాయిబాబాకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి షిర్డీ సంప్రదాయంగా హారతులు నిర్వహించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు అఖండ సాయి నామ సంకీర్తన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ సామూహిక పారాయణం నిర్వహించారు. శ్రీసాయిమాత నిత్యాన్నప్రసాద నిలయంలోని సాయిసేవాలయంలో ఉదయం సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవాన్ని నయనానందకరంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి సాయినాథుడి దివ్య రథ నగరోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. షిర్డీ సంప్రదాయంగా ప్రత్యేకంగా అలంకరించిన రథంపై సాయినాథుడి చిత్రపటాన్ని ప్రతిష్ఠించి ఫకీర్ల జరబులు, మంగళవాయిద్యాలు, తీన్‌మార్ బ్యాండ్ మేళాలు, కేరళ సంప్రదాయ సింగారి మేళం, పండరి భజన, కోలాటాల నడుమ నగరోత్సవాన్ని జరిపారు. పద్మావతినగర్, బాలాజీ నగర్, ఏసీనగర్ తదితర ప్రాంతాల మీదుగా నగరోత్సవం సాగింది. మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్య రథోత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను మందిరం గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య, శ్రీసాయి భక్త బృందం సభ్యులు పర్యవేక్షించారు.

కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో కొలువైన సీతా, లక్ష్మణ, హనుమత్ సమేత అనంత కోదండరామస్వామి 43వ వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేశారు. శాస్త్రోక్తంగా విష్వక్సేన పూజ, అంకురార్పణ పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా కనిశెట్టి సుబ్బారావు, విజయలక్ష్మి దంపతులు వ్యవహరించారు. ఆలయ నిర్వాహకులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, తన్నీరు మస్తాన్‌రావు, అమరా మోహన్‌రావు, ఏపీఎస్ కృష్ణమోహన్, హనుమంతరావు పర్యవేక్షించారు.

వైభవంగా ధ్వజారోహణం



కమలం అలంకారోత్సవంలో ఆంజనేయస్వామి

నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆంజనేయస్వామి మందిరంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ఉదయం 8గంటలకు ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం 11గంటలకు తిరుచ్చి ఉత్సవం జరిపారు. రాత్రి ఆంజనేయస్వామి కమలం అలంకారోత్సవంలో భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తలుగా చిన్నివిజయకుమార్, స్వయంపాకుల సాయిరాం, డీవీఎస్ గిరి వ్యవహరించారు. ఆలయ ఈఓ జీ దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గ పరిధిలోని 22వ డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకులు పినిశెట్టి రాము, అక్బర్ నవాజ్ ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి అన్ని విధాల అండగా ఉంటామని, పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మలిరెడ్డి కోటారెడ్డి పాల్గొన్నారు.




పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఆదాల

రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘ సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘ సర్వసభ్య సమావేశాన్ని భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల సంక్షేమ సంఘ భవనంలో శుక్రవారం సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్ఎం గౌస్, ఎస్వీపీఎస్ మూర్తి బుధవారం తెలిపారు. నెల్లూరు సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వృద్ధులకు వచ్చే వివిధ ఆరోగ్య సమస్యలపై ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్కే కాలేషాసాహెబ్ అవగాహన కల్పిస్తారని తెలిపారు. జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు హాజరుకావాలని కోరారు.

కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ మృతికి సంతాపం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ముత్తుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండ్లూరి విల్సన్ బుధవారం మృతి చెందారు. ఆయన మృతిపై ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, జనరల్‌సెక్రటరీ కమల్‌కిరణ్ తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉద్యోగ సంఘ నాయకుడిగా ఉద్యోగుల మన్ననలు పొందిన విల్సన్ మృతి తీరనిలోటు అని పేర్కొన్నారు.



విల్సన్ (ఫైల్)